క్లుప్తంగా

పాఠశాలకు చేరిన 'విద్యాకానుక'



విద్యాకానుకను గదిలో భద్ర పరచిన దృశ్యం

రుద్రవరం: జగనన్న విద్యా కానుక కిట్లు లారీలో బుధవారం మండల కేంద్రానికి చేరుకున్నాయి. వాటిని విద్యాశాఖ సిబ్బంది స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల గదిలో భద్రపరచారు. ఎంఈఓ కోటయ్య మాట్లాడుతూ మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలల్లో 5,131 మంది విద్యనభ్యసిస్తున్నారు. వారి కోసం ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు సరఫరా చేసింది. టెస్ట్ బుక్స్ 45,451, వర్క్ బుక్స్ 13,149 అందుబాటులో ఉన్నాయని అలాగే యూనిఫాం అందరికీ సిద్ధంగా ఉందని చెప్పారు. 1- 5వ తరగతి విద్యార్థులకు బొమ్మల డిక్షనరీలు, 6-10వ తరగతి ఇంగ్లిష్ - తెలుగు డిక్షనరీలను సరఫరా చేసిందని వివరించారు.

పెరిగిన ఆదాయం

శిరివెళ్ల: గోవింపల్లెలోని శ్రీ గౌరీ మల్లేశ్వరస్వామి, శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన 30.23 ఎకరాల మాన్యం కౌలుకు బహిరంగ వేలం పాటలు బుధవారం జరిగాయి. చైర్మన్ శివచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన వేలాల్లో ఆలయాలకు ఆదాయం పెరిగింది. పోటా పోటీగా జరిగిన పాటలలో రూ. 2.15 లక్షలు ఆదాయం లభించింది. గతేడాది రూ.1.50 లక్షలు వచ్చింది. ఈఓ స్వర్ణముఖి, రైతు సంఘం నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నేమ్ బోర్డులు తప్పనిసరి

ఉయ్యాలవాడ : ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పని ప్రదేశాల్లో తప్పనిసరిగా నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏపీఓ రవిప్రకాష్ సూచించారు. బుధవారం మండలంలోని కొండుపల్లె, హరివరం, సర్వాయిపల్లె గ్రామాల్లో అమృత సరోవర్ కింద కుంటల్లో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు.

సీసీరోడ్లు, డ్రైనేజీల ప్రారంభం



సీసీ రోడ్లు, డ్రైన్లను ప్రారంభిస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): పట్టణంలోని 17వ వార్డులో రూ.20లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను కౌన్సిలర్ సుబ్బలక్ష్మి, మున్సిపల్ చైర్పర్సన్ షేక్‌మాబున్నిసా బుధవారం ప్రా రంభించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి హాజరయ్యారు.ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్న ప్రతివాడకు సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నామన్నారు. కమిషనర్ రవిచంద్రారెడ్డి, వైస్ చై ర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి పాల్గొన్నారు.

మాన్యం కౌలుకు వేలం

రుద్రవరం:శ్రీరంగాపురం గ్రామంలోని ఈశ్వర, రామ, ఆంజనేయ,ఈశ్వరమ్మ ఆలయాలకు సంబంధించిన మాన్యం భూములకు బుధవారం దేవదాయశాఖ అధికారులు కౌలుకు వేలం నిర్వహించారు. ఈఓ వేణునాథరెడ్డి మాట్లాడుతూ మొత్తం 19.99 ఎకరాలకు వేలం నిర్వహించగా రూ.2.98 లక్షల ఆదాయం వచ్చిందని గతేడాది రూ.2.55 లక్షలు రాగా ఈ ఏడాది రూ.43వేలు అదనంగా సమకూరిందని చెప్పారు. పర్యవేక్షణ అధికారిగా పుట్టాలమ్మ క్షేత్ర ఈఓ సాయిజయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు కోరారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులు పెంచి వసూలు చేస్తున్నారని, అలాగే పుస్తకాల పేరుతో దోపిడీకి పాల్పడుతున్న విద్యా శాఖ అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి

ఆళ్లగడ్డ: బాలేశ్వర్ ఘోర రైలు ప్రమాద మృతులకు ఆళ్లగడ్డలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. బుధవారం స్థానిక కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల నిర్వాహకులు, ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు.

నంద్యాలలో వర్షం

నంద్యాల టౌన్: కొన్ని రోజులుగా భానుడి ప్రతాపానికి విలవిల్లాడిన జనానికి బుధవారం సాయంత్రం కురిసిన జల్లులతో కొంత ఉపశమనం పొందారు. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో రేగిన గాలి దుమారంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది.

అనైతిక రాజకీయాలు చేయడంలో బాబు దిట్ట

నంద్యాల (అర్బన్): 2018లో బీజేపీ చేసిన ద్రోహంపై ధర్మ పోరాట దీక్షలు చేసిన చంద్రబాబు.. ఇటీవల మళ్లీ ఆ పార్టీ అగ్రనేత అమిత్ షాతో కలిసి రహస్య మంతనాలు చేయడం అనైతిక రాజకీయాలకు నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.

సాగుకు ఊతం

- ఆర్‌బీకేలకు చేరుకుంటున్న ఎరువులు
- 5,497 మంది రైతుల ఖాతాల్లో 'వైఎస్సార్ రైతు భరోసా' సొమ్ము జమ
- సేద్యపు పనుల్లో అన్నదాత బిజీ
- ఇప్పటికే పిల్లిపెసర, మినుము,కంది, పెసర విత్తనాలు అందుబాటులో



ఉయ్యాలవాడ సమీపంలో పొలాన్ని ట్రాక్టర్‌తో సిద్ధం చేస్తున్న రైతు



ఇంజేడు రైతు భరోసా కేంద్రంలో సిద్ధంగా ఉన్న ఎరువులు

ఉయ్యాలవాడ : గత ప్రభుత్వ హయాంలో ఎరువుల కొరత రైతాంగాన్ని పట్టి పీడించేది. ఎరువులు అందుబాటులో లేక రైతన్నలు ధర్నాలు చేయాల్సి దుస్థితి. అలాగే పెట్టుబడులకు సొమ్ము దొరకక అప్పులు చేసి పంటలు సాగు చేసేవారు. ఇక పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక అన్నదాత నష్టాలు చవిచూసేవాడు. గడిచిన మూడు సంవత్సరాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లో ఎరువులను రాష్ట్ర ప్రభుత్వమే ఆర్బీకేల ద్వారా రైతులకు అందజేస్తుంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాల కాలంలో రైతులకు అన్ని విధాలా అండగా ఉంటోంది. రైతులకు ఖరీఫ్ సాగుకు ముందే ఏటా మే నెలలో రూ.7,500 పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది మండలంలోని 5,497 మంది రైతులకు పెట్టుబడి సాయం రూ. 4,04,17,500 రైతుల ఖాతాల్లో జమ చేసింది. అలాగే ఇందులో 108 మంది కౌలు రైతులు కూడా లబ్ధిపొందారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 50 శాతం సబ్సిడీతో జీలుగ, పిల్లిపెసర, జనుము, 30 శాతం సబ్సిడీతో మినుము, కంది, పెసర విత్తనాలు ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉన్నాయి. ఇక ఖరీఫ్ సాగుకు అవసరమైన, సరిపడ ఎరువులు సైతం కేంద్రాలకు చేరుతున్నాయి.

వ్యవసాయ పనుల్లో రైతన్న..

మండలంలో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు.సాధారణ సాగు విస్తీర్ణం 2,750 హెక్టార్లు కాగా ప్రస్తుతం గత ఏడాది పంటల అవశేషాలు తొలగింపు, వేసవి సేద్యాలు, సేంద్రియ ఎరువులు వెదజల్లే పనుల్లో బిజీగా ఉన్నారు. ముందస్తు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. వర్షాలు కురిసి భూమి పదునైతే మొక్కజొన్న, పత్తి, మినుము, కొర్ర, కంది తదితర పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

డబ్బులు జమ అయ్యాయి



వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం నా బ్యాంకు ఖాతాల్లో రూ. 5,500 జమ అయ్యింది. మూడు ఎకరాలు సొంత భూమి, 10 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. గతంలో సీజన్ మొదలైతే పెట్టుబడుల కోసం అప్పులు చేయవలసి వచ్చేది. ఉచితంగా నాలుగు సంవత్సరాల నుంచి ఏటా రూ. 13,500 ఖాతాలో జమ అవుతుండటంతో ఎరువులు, విత్తనాలు, సేద్యపు పనులకు నగదు ఇబ్బందులు తప్పాయి.

– తలారి రామనాయుడు, రైతు, ఉయ్యాలవాడ

ఆర్బీకేల నుంచి విత్తనాలు, ఎరువులు అందుతున్నాయి



రైతులకు ఎరువులు, విత్తనాలు భరోసా కేంద్రా ల నుంచి అందుతున్నాయి. యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువుల కోసం టీడీపీ పాల నలో రోడ్డెక్కి ధార్నా చేశాం. అప్పట్లో బ్లాక్‌లో కొనగోలు చేసి పంటలు వేశాం.నివాసం ఉన్న గ్రామంలోనే అన్ని రకాల సేవలు రైతులకు అందుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతుకు ఏ ఏడాదిలో జరిగితే అదే ఏడాదిలో పరిహారం అందజేయడం అభినందనీయం.

– పార్థసారథిరెడ్డి, రైతు, కాకరవాడ

ఎరువుల కొరత లేదు



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువులు పుష్కలంగా అందుబాటులోనున్నాయి. ఆర్‌బీకేల్లో ఇప్పటికే 1,815 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులు నిల్వ ఉన్నాయి. విత్తనాలు, ఎరువులు, కావలసిన రైతులు తమ ఆధార్‌కార్డుతో రైతు భరోసా కేంద్రంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

– రాజేంద్రకుమార్, మండల వ్యవసాయాధికారి, ఉయ్యాలవాడ

సమస్యలకు పరిష్కారం చూపాలి

దొర్నిపాడు: ప్రజల సమస్యలకు సచివాలయ ఉద్యోగులు తక్షణమే పరిష్కారం చుపాలని ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా గ్రామంలోని సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల అర్జీలను ఎప్పటికప్పుడు ఆయా శాఖలకు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ప్రతి రోజూ స్పందన నిర్వహించడంతో పాటు వేళకు హాజరు కావాలని ఆదేశించారు. సంక్షేమ పథకాల పోస్టర్లను సచివాలయంలో అతికించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ శివరామిరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు రక్షణ కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీ వర్కర్లపై దాడులు అరికట్టి రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నిర్మలమ్మ, ప్రధాన కార్యదర్శి నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం, రాయవరం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త అనుసూయమ్మను హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు, గర్భిణీలకు సేవలు అందిస్తున్న అంగన్‌వాడీల పై దాడులకు పాల్పడడం హేయమన్నారు. నాయకులు తోట మద్దులు, గౌస్, అంగన్‌వాడీ వర్కర్లు లలితమ్మ, నాగరాణి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేయండి



విత్తన నాణ్యత నిర్ధారణ చేస్తున్న నాగేంద్ర ప్రసాద్

ఆళ్లగడ్డ: నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకు రైతులు ముందుకు రావాలని డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ అనలిస్ట్ నాగేంద్ర ప్రసద్ అన్నారు. స్థానిక వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో బుధవారం విత్తన పరీక్షకు వచ్చిన రైతులకు విత్తనాలకు ఏఏ పరీక్షలు చేయించుకోవాలోఅవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పరీక్షించేందుకు అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేసిందన్నారు. సాగు చేసేందుకు రైతు తీసుకొచ్చిన విత్తనాలు, ఎరువులను ల్యాబ్‌లో ఉచితంగా పరీక్షిస్తామన్నారు. విత్తనాలు, ఎరువులు నాణ్యతా ప్రమాణాలు పరీక్షించుకోవాలనే రైతులు ముందుగా ఆర్‌బీకేలో సిబ్బందిని కలిసి నమూనాలు ఇచ్చి ఏఏ పరీక్షలు చేయించుకోవాలో నమోదు చేసుకుంటే ఆర్బీకే సిబ్బంది ల్యాబ్‌కు పంపుతారని చెప్పారు. పరీక్ష ఫలితాలను వారం నుంచి పది రోజుల్లోపు అందజేస్తామన్నారు. రైతులు తీసుకొచ్చిన విత్తనాలు, ఎరువుల నాణ్యతా ప్రమాణాలు, తేమ మొలకశాతం తెలుసుకునేందుకు ఉచితంగా పరీక్షలు చేస్తామని, అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీగణపతి స్వామి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆత్మకూరు బస్టాండ్‌లో వెలసిన శ్రీలక్ష్మీ గణపతి దేవస్థానంలో బుధవారం సంకటహర చతుర్థి వేడుకలను నిర్వాహకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ పంచామృతాభిషేకం నిర్వహించి గరికతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం నవగ్రహ హోమం, గణపతి హోమం చేపట్టి పూర్ణాహుతి గావించారు. అలాగే.. సంకటహర చతుర్థి వ్రతాన్ని ఆచరించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. నిర్వాహకులు తిరివీధి సురేష్, సుమశ్రీ రవి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రభుత్వ ప్లీడర్



శ్రీనివాసులు

నంద్యాల (వ్యవసాయం): జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టులో సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏపీపీగా పని చేస్తున్న మహేశ్వరి ఆదోనికి బదిలీ అయ్యారు. శ్రీనివాసులు మాట్లాడుతూ అనంతపురంలో పోలీస్ ట్రెనింగ్ కాలేజీలో లా ఫ్యాకల్టీగా పని చేశానని, బదిలీపై నంద్యాలకు వచ్చానని చెప్పారు. సీనియర్ న్యాయవాదులు విజయశేఖర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, కృష్ణ లింగయ్య, రఘుప్రకాశ్, ఏపీపీలు వివేకానందరెడ్డి, గోపాల కృష్ణారెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

జీలుగ విత్తనాల పంపిణీ



రైతులకు జీలుగలను అందజేస్తున్న ఎంపీపీ

దొర్నిపాడు: రానున్న ఖరీఫ్ పంటల సాగుకు ముందుగా పొలాలను సారవంతం చేసేందుకు ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలు మంజూరు చేసిందని వరి పంట సాగు చేసే రైతులు వినియోగించుకోవాలని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని గుండుపాపల గ్రామంలోని రైతులకు రాయితీతో అందిస్తున్న జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలానికి 65 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయని 65మంది వీటి కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు చెప్పారు. మార్కెట్ ధర కిలో రూ.79 ఉంటే సబ్సిడీ పోనూ రైతులకు కిలో రూ.39.50 ప్రకారం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వరిసాగుకు ముందు జీలుగలు వేసుకుంటే రైతులకు పెట్టుబడులు కలిసి వస్తాయన్నారు. సర్పంచ్ వెంకటేశ్వర్లు, వీఏఏ గురుగోవర్ధన్ పాల్గొన్నారు.

పథకాలు అర్హులకు అందాలి



మట్లాడుతున్న ఎంపీపీ ఆర్థర్ సైమాన్

గోస్పాడు: సేంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు కృషి చేయాలని ఎంపీపీ ఆర్థర్ సైమాన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలు అందించాలన్నారు. నీటి సమస్య లేకుండా చూడాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యురాలు జగదీశ్వరమ్మ, వైస్ ఎంపీపీ జనార్ధన్ రెడ్డి, రాజు, ఎంపీడీఓ సుగుణశ్రీ, ఈఓఆర్డీ నాగేంద్రుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మహిళలు ముందుకు రావాలి



చిరుధాన్యాలతో చేసిన పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: చిరుధాన్యాల ప్రాసెసింగ్‌కు ఔత్సాహిక మహిళలు ముందుకు రావాలని బనగానపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ లక్ష్మీప్రియ సూచించారు. బుధవారం స్థానిక డీఆర్‌డీఏ-వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఏపీఎం బాబు ఆధ్వర్యంలో మహిళలకు ఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె ఫుడ్ ప్రాసెస్ ఎలా చేయాలి, వాటిని ఎలా మార్కెటింగ్ చేసుకోవాలో తెలియజేశారు. అలాగే.. చిరుధాన్యాలతో ఎలాంటి పిండి వంటలు చేసుకోవాలి, వాటికి సంబంధిచిన పరికరాలు ఎక్కడ దొరుకుతాయి, వాటి ఉపయోగాలను వివరించారు. ఆసక్తి గల మహిళలకు శిక్షణతో పాటు అవగాహన కల్పిస్తామని ఏపీఎం చెప్పారు. అనంతరం చిరుధాన్యాలతో చేసిన పదార్థాలు, వాటి ఉపయోగాలను ప్రదర్శించారు.

సేవా సైన్యానికి సలాం





వలంటీర్లకు పురస్కారాలను అందిస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పారవి , కార్యక్రమానికి హాజరైన, అధికారులు, వలంటీర్లు

- 27 రకాల పథకాలకు వలంటీర్లు అంబాసిడర్లు
- నంద్యాల మున్సిపల్ పరిధిలో 879 మందికి పురస్కారాలు
- 2 సేవా వజ్ర, 9 సేవారత్న, 868 మందికి సేవా మిత్రతో ఘన సత్కారం
- ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): సంక్షేమ పథకాలను అర్హులకు అందజేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమని, నిస్వార్థ సేవలందిస్తున్న సైనికులకు సలాం చెప్పాలని ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ టౌన్ హాల్‌లో పట్టణంలోని వలంటీర్లను సన్మానించి పురస్కారాలు అందజేశారు. మున్సిపల్ చైర్పర్సన్ షేక్‌మాబున్నిసా ఆధ్వర్యంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి పట్టణంలోని 42 వార్డులకు గాను 48 సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న 1,024 మంది వలంటీర్లకు గాను ఇద్దరికి సేవా వజ్ర, 9 మందికి సేవా రత్న, 868 మందికి సేవా మిత్ర పురస్కారాలు అందజేశారు. ఎంపీ పోచా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థతో సంక్షేమం, అభివృద్ధి దూసుకుపోతుందన్నారు. కరోనా సమయంలో సంక్షేమ ఫలాలు ఆగకుండా అర్హులందరికీ అందజేసి ఆదర్శంగా నిలిచారని, ఇందులో వలంటీర్ల సేవలు ఎనలేనివని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో జగన్ సైనికుల్లా వలంటీర్లు పని చేసి మళ్లీ సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టాలన్నారు. ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 879 మంది వలంటీర్లకు ప్రోత్సాహకంగా రూ.89.20 లక్షలు అందిస్తున్నామన్నారు. ముందుగా వలంటీర్లతో ఆయన ముఖాముఖి నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వ్యవస్థలో తమ గుర్తింపు, అవసరం ఎంతో ఉందన్నారు. నంద్యాలలో విరివిగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నా ఏమీ చేయలేదంటూ ఎల్లో మీడియాతో ప్రచారం చేయడం సరికాదన్నారు. వలంటీర్లకు గత ప్రభుత్వంలో ఇస్తున్న నిరుద్యోగ భృతి కంటే గౌరవ ప్రదమైన, ఆత్మ తృప్తిని ఇస్తున్న ఒక బాధ్యతాయుతమైన సేవ అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి, కో ఆప్షన్ మెంబర్లు సలాముల్లా, పడకండ్ల సుబ్రహ్మణ్యం, డైరెక్టర్లు సునీత అమృతరాజ్, చంద్రశేఖర్, కౌన్సిలర్లు, నాయకులు అమృతరాజ్, జాకీర్ హుస్సేన్, టీ.వీ రమణ, అధికారులు పాల్గొన్నారు.

వేడుకగా చర్చి వార్షికోత్సవం

చాగలమర్రి: పెద్దబోధనం గ్రామంలోని సైఫెన్ సీఎస్ఐ చర్చి 30వ వార్షికోత్సవాన్ని బుధవారం వేడుకగా జరుపుకున్నారు. చర్చి విశిష్టతను ఫాదర్ రెవ.సంపత్ వివరించారు. అనంతరం పాస్టర్ విమలమ్మ సేవలను కొనియాడారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం విందులో పాల్గొన్నారు.

నేడు యాళ్లూరు ఉపసర్పంచ్ ఎన్నిక

గోస్పాడు: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు యాళ్లూరు ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియ గురువారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి నాగేంద్రుడు తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ యాళ్లూరు గ్రామ ఉపసర్పంచ్‌గా ఉన్న బెక్కెం శకుంతలమ్మ తన పదవికి ఇటీవల రాజీనామా చేశారు.

కంపోస్ట్ యార్డు పరిశీలన

నంద్యాల(సిటీ): పట్టణ శివారులోని భీమవరం రోడ్డులోనున్న కంపోస్టు యార్డును మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి బుధవారం సాయంత్రం పరిశీలించారు. లెగసీ వేస్ట్ శుద్ధీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆళ్లగడ్డ: ఆల్ఫా కళాశాల సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. పట్టణానికి చెందిన గౌస్, గిరి పని మీద చాగలమర్రికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ఆల్ఫా కళాశాల సమీపంలో వెనుక వైపునుంచి కారు మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టింది. దీంతో గౌస్, గిరి తీవ్రంగా గాయపడగా 108 వాహనంలో స్థానిక వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీ కూతురుకు..

శిరివెళ్ల: నంద్యాల – ఆళ్లగడ్డ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటాపురం గ్రామానికి చెందిన తల్లీ కూతురు మహాలక్ష్మి, శ్రీలక్ష్మికి గాయాలయ్యాయి. సొంత పని మీద స్వగ్రామం నుంచి యర్రగుంట్లకు స్కూటీపై వెళ్తుండగా నంద్యాల నుంచి ఆళ్లగడ్డ వైపు వెళ్తున్న మరో మోటార్ బైక్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు కాగా చికిత్స నిమిత్తంగా నంద్యాలకు తరలించారు.

చెల్లెలిపై అన్న దాడి

శిరివెళ్ల: గుండంపాడులో చిన్ని అనే మహిళపై ఆమె అన్న భాస్కర్ దాడి చేశాడని ఎస్‌ఐ సురేష్ బుధవారం తెలిపారు. చెల్లెలు నుంచి అప్పుగా తీసుకున్న డబ్బులు ఎన్నాళ్లకు ఇవ్వక పోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది.దీంతో భాస్కర్‌తో పాటు బంధువులు మరియమ్మ, చిన్నప్ప, మధునిక రాయితో చిన్నిపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

12లోపు నాడు–నేడు పనులు పూర్తి చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: మన బడి నాడు- నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న పనులు ఈ నెల 12వ తేదీలోపు పూర్తి స్థాయిలో పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీర్లు, ఎంఈఓలను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ నిశాంతితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పనుల ప్రగతిపై మండలాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు మండలంలో అత్యంత తక్కువగా ప్రగతి చూపిన పంచాయతీరాజ్ ఏఈకి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. పెద్ద, చిన్న మరమ్మతులు, కిచెన్ షెడ్, రూఫ్ సీలింగ్, టాయిలెట్ల నిర్మాణం, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లతో విద్యుద్దీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థులు, సిబ్బంది కోసం ఫర్నీచర్, పాఠశాలలకు పెయింటింగ్, ఆకుపచ్చ సుద్ద బోర్డులు తదితర పనులు వేగవంతం చేయాలన్నారు. స్థానిక సమస్యలు ఉన్న జూపాడుబంగ్లా తదితర మండలాల్లో పంచాయతీరాజ్ ఇంజినీర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పూర్తి చేయాలని చెప్పారు. విద్యా కానుక కిట్ల నాణ్యతపై అన్ని మండలాల నుంచి వివరాలు సేకరించారు. ఈనెల 11వ తేదీ సాయంత్రంలోపు అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లు సరఫరా కావాలని సూచించారు. బడి బయట ఉన్న పిల్లల సర్వే 89 శాతం పూర్తయిందని గురువారం సాయంత్రంలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓ అనురాధ, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి లలిత పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే ప్రభుత్వాన్ని ఆదరించండి



పథకాల బుక్‌లెట్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల : అభివృద్ధి చేసే ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 9వ వార్డు గుడిపాటి గడ్డలో కౌన్సిలర్ నాగమ్మ, వార్డ్ ఇన్‌చార్జ్ దండి సుధాకర్, కో ఆప్షన్ సభ్యుడు పడకండ్ల సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆర్ల వెంకటస్వామితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి జగనన్న పాలన తీరు, పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సిద్ధం శివరాం, శ్రీనివాసులు, అమీర్, గన్నిబ్యాగ్స్ షేక్షా, కౌన్సిలర్ కలాంబాషా, మజీద్ పాల్గొన్నారు.

ముమ్మరంగా రోడ్ల నిర్మాణాలు



వీరారెడ్డిపల్లెలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులు

శిరివెళ్ల: మండలంలోని గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. వీరారెడ్డిపల్లెలో సర్పంచు మందాల శివారెడ్డి ఆధ్వర్యంలో రూ.9 లక్షల గడప గడప నిధులు, రూ.5 లక్షల ఎంపీ నిధులు, రూ.6 లక్షల నియోజకవర్గ అభివృద్ధి నిధులతో సిమెంట్ రోడ్డు పనులు తుది దశకు చేరుకున్నాయి. కోటపాడు గ్రామ పంచాయతీలో సర్పంచు ఉశేనిబీ ఆధ్వర్యంలో రూ.8 లక్షల గడప గడపకు నిధులతో సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. కామినేనిపల్లెలో రూ.4 లక్షల గడప గడప నిధులు, పీఎంపీజీవై నిధులు రూ.5.35 లక్షలతో సర్పంచు చిన్న నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డు పనులు, వెంకటాపురంలో రూ.10 లక్షల జెడ్పీ నిధులో సర్పంచు మల్లేశ్వరి ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏఈ రవికుమార్ మాట్లాడుతూ మండలంలో తాజాగా రూ.70 లక్షలతో 13 సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపడితే ఇంత వరకు 9 పనులు పూర్తయ్యాయన్నారు.